


ఆ రోజు మూడో తారీఖు

పరమహంస రెవిన్యూస్టాంప్ మీద సంతకంచేసి, కేషియర్ అందించిన బ్రౌన్‌కలర్ కవర్ అందుకున్నాడు

ఆ పే ఎన్వలప్ మీద మొత్తం జీతం, డిడక్షన్స్ మొదలయిన వివరాలున్నాయి, పరమహంస పేరు, టికెట్ నంబర్లతో పాటుగా మూడువందల తొంభైఎనిమిది రూపాయలు వచ్చాయి ఆ నెల జీతం జీతం అందుకున్న మరో అయిదు నిముషాలదాకా పే కౌంటర్ దగ్గరే వున్నాడు పరమహంస. అప్పు ఇచ్చేయవలసిన వాళ్ళకి ఇస్తూ, తీసుకోవల్సినవాళ్ళదగ్గర తీసుకుంటూ

సరిగ్గా అయిదూ ముప్పై అయిదుకి ఆఫీస్‌లోంచి హుషారుగా బయటకి వచ్చాడు ఎదురుగావున్న ఇరానీ రెస్టారెంట్‌లోకి చొరబడ్డాడు. సర్వర్ రాగానే సమోసా, టీ తీసుకురమ్మని చెప్పి, జేబులోంచి పెన్ తీసి జీతం వచ్చిన కవరుమీద ఆ నెల ఖర్చులన్నీ వరసగా వ్రాసాడు. కూడాడు వాటిని.

మూడువందల అరవై మూడురూపాయల ఖర్చు మొత్తం;

మున్ఫైఅయిదు రూపాయలు మిగులు తుంది జీతంలో ఈనెల జాగ్రత్తగా వుంటే నెల మధ్యలో ఓవర్ టైమ్ బిల్ నూటపది రూపాయలదాకా వస్తుంది. అంటే షుమారుగా నూటనలభైఅయిదు రూపాయలు ఎక్కువ ఈ నెల

సర్వర్ సమోసాలప్లేట్ తెచ్చి పరమహంస ముందుంచాడు వాటిని తింటూ అనుకున్నాడు ఎలాగైనా ఈ నెల తన భార్య పుట్టినరోజుకి, చాలా రోజులుగా అడుగుతున్న షిఫాన్‌చీర కొనివ్వాలని నూటడభ్భైరూపాయలు ఆ చీర ఖరీదు

ఉదయం ఆఫీస్‌కొస్తూంటే పరమ హంస చూసాడు ఆ గులాబిరంగు షిఫాన్ చీర ఇంకా డిస్‌ప్లేవిండోలోని బొమ్మకి కట్టి వుండటం. ధర విచారించాడు. సాయంత్రందాకా వుంచితే, తప్పకుండా సాయంత్రం కొంటానని చెప్పివచ్చాడు పరమహంస ఆ షాపువాళ్ళతో

పావుగంట తర్వాత బయటకి నడిచాడు ఆ ఇరానీ రెస్టారెంట్‌లోంచి అయిదారు నిముషాలు నడిచి ఆ షాపు ముందు ఆగాడు అప్పుడే చీకటి అలుముకుంటూండటంవల్ల నియాన్ లైట్లు వెలిగించారు ఆ షాప్ డిస్‌ప్లే విండోకి,

గ్లాస్ పేన్ వెనక అంగసౌష్ఠవంగల అందమయిన అమ్మాయి బొమ్మలు నాలుగు నిల్చుని వున్నాయి నైపుణ్యంగా నాలుగు అందమయిన చీరలు కట్టబడివున్నాయి ఆ బొమ్మలకి హఠాత్తుగాచూస్తే నిజంగా అమ్మాయిలేనేమో నన్న భ్రమ కలిగేలా వున్నది ఆ బొమ్మల వంటిరంగు, మానవచర్మం రంగులో

వాటిలో ఓ బొమ్మకి, పరమహంసకి కావల్సిన గులాబిరంగు షిఫాన్‌చీర కట్టి వుంది నీట్‌గా రెండు నెలలుగా ఆ చీర కొనాలని తాపత్రయపడుతున్నాడు. కాని ప్రతినెలా ఏదో ఓ ఇబ్బంది వస్తూనే వుంది గులాబీరంగంటే ఇష్టం ఆ చీర చాలా నచ్చింది పరమహంస భార్యకి

ఈ రెండు నెలలనుంచీ ఆ చీర కూడా అలాగే వుంది, తనకోసమే ఆగినట్లుగా ఎప్పటికప్పుడు ఆచీర మాయమవుతుందని భయపడుతూనే వున్నాడు కాని పరమహంస భయం ఈరోజుదాకా నిజం కాలేదు

పుట్టినరోజుకి తన భార్యకి ఎలాగైనా ఆ చీర కొని ప్రజెంట్‌చేసి ఆశ్చర్యపడేలా చేయాలని నిశ్చయించుకున్నాడు పరమహంస అందుకే కష్టపడి రోజుకి మూడుగంటలు ఓవర్ టైమ్ చేస్తూ వచ్చాడు

లోపలికి వెళ్ళాడు పరమహంస. మొదటివారం ప్రభావంవల్ల లోపల బాగా రద్దీగావుంది పైన చాలా సీలింగ్‌ఫేన్లు

తిరుగుతూనేవున్నా, వేడిగా వుంది లోపల

సేల్స్‌కౌంటర్ వైపు నడిచాడు పరమహంస సేల్స్‌గర్ల్ చాలా బిజీగా వుంది ఎవరికో చీరలు చూపిస్తూ

"చూడండి బయట డిస్‌ప్లేవిండోలో షిఫాన్ చీర ఒకటి బొమ్మకి కట్టారు ఒకటి కావాలి అలాంటిది" అడిగాడు

"గులాబి రంగుదా?" అడిగింది సేల్స్‌గర్ల్

"అవును"

"అవి అమ్మడానికి కాదు"

"ఏం?"

పరమహంస తన సమాధానానికి నిరుత్సాహపడ్డాడని గ్రహించి చెప్పింది సేల్స్‌గర్ల్.

"ఒక లాట్‌లో పదిచీరలు వచ్చాయి మాకు తొమ్మిది అమ్మేశాము, ఆ పదోది అమ్మద్దనీ, దాన్ని అలాగే వుంచేయమని చెప్పారు సేఠ్"

"ఇంక లేవా అయితే, అది తప్ప వేరే?" సందేహం తీర్చుకోడానికి అడిగాడు పరమహంస

"లేవు" అని చీరలు బేరంచేస్తున్న ఆడగతా వాళ్ళవైపు తిరిగింది సేల్స్‌గర్ల్

రెండుమూడు నిముషాల తర్వాత సేల్స్‌గర్ల్ ఇంకా అక్కడే నిలబడ్డ పరమహంసని చూసి చెప్పింది

'మా సేఠ్‌ని కలవండి, అయన అమ్ముతానంటే తీసుకుందురుగాని"

ఉత్సాహం అంతా చప్పబడిపోగా, నీరసంగా 'ప్రొప్రయిటర్' అని వ్రాసివున్న ప్లైవుడ్ తలుపువైపు నడిచాడు పరమహంస మిణుకు మిణుకు మనే ఆశతో లోపలకి వెళ్ళాడు, తలుపు తోసుకుని

చాలా చిన్నగది అది మూడువైపులా ప్లైవుడ్ చెక్కలు గోడలో అమర్చబడి వున్నాయి లోపల ఓ చిన్న గాడ్రేజ్ టేబిల్ ముందు, ఓ సింధీ ముసలాయన కూర్చుని ఫైల్‌లోని బిల్స్‌ని కేష్‌బుక్‌లోకి వ్రాసుకుంటున్నాడు

తల ఎత్తి ఏంకావాలనట్టుగా చూశాడు ఆయన, పరమహంస లోపలికి అడుగు పెట్టగానే


"మీ డిస్‌ప్లేవిండోలోని గులాబిరంగు చీర కొందామని వచ్చాను కాని అది అమ్మకానికి కాదని చెప్తోంది మీ సేల్స్‌గర్ల్"

"కూర్చోండి" అన్నాడు ఆయన కుర్చీవైపు చూపిస్తూ

పరమహంస కూర్చున్నాడు ఆయన మళ్ళీ ఫైల్‌లోకి తలదూర్చాడు "ఆ చీర కొందామని వచ్చారా?" అడిగాడు ఫైల్‌లోని కాగితాలు చూస్తూనే

"అవును పుదయం ఆ చీరని వుంచమని చెప్పి వెళ్ళానుకూడా"

"మధ్యాహ్నమే లాస్ట్‌పీస్ అమ్మారనుకుంటాను మీరు నెలరోజులు ఆగలేరా? ఆ రకం చీరలకోసం వ్రాసాము నెలరోజుల్లో రావచ్చు"



"షంకేషాపులో దొరుకుతుందో చెప్పగలరా ? ఎల్లుండే మా ఆవిడ పుట్టినరోజు ..మా పెళ్ళయిన తర్వాత వచ్చిన మొదటి పుట్టినరోజు అందులో."

''ఎక్కడా దొరకవనుకుంటాను మార్కెట్‌లో లేవు అయినా ప్రక్క షాప్‌లో అడిగి చూడండి అక్కడ లేక పోతే మళ్ళీ రండి "

పరమహంసలో కొత్త ఆశ పుట్టి ది "అలాగేసార్'' అని బయటకివెళ్ళి, అయిదునిముషాలు కాకుండానే తిరిగి వచ్చాడు

"దొరకలేదా ?" అడిగాడు సేర్.

తల అడ్డంగా వూపాడు పరమహంస

"ఓ వందరూపాయల సరకు కొనండి ఏవైనా ఆ చీరకూడా తీసుకుందురు గాని "

"వందరూపాయల సరకే? నా దగ్గిర అంత డబ్బు లేదు" వెంటనే జవాబు చెప్పాడు పరమహంస

ఆలోచనగా చూసి చెప్పాడు సేర్ కానేపాగి.

"అలా కాకపోతే, ఆ చీర ఖరీదుమీద పదిరూపాయలు ఎక్కువ ఇవ్వాల్సి వస్తుంది మీరు"

పదిరూపాయలు! పదిరూపాయలు ఎక్కువే కాని పెళ్ళయిన తర్వాత వచ్చే భార్య మొదటి పుట్టినరోజు జీవితంలో ఒక్కసారే వచ్చేది

"ఆలాగే" అన్నాడు పరమహంస నిట్టూర్చి

సేర్ కాలింగ్‌బెల్ నొక్కి ప్యూన్‌ని పిలిచి, ఏదో చెప్పి పంపాడు సింధీలో

"కాషియర్‌కి డబ్బు చెల్లించి తీసుకోండి" చెప్పాడు సేర్ పరమహంసతో

థాంక్స్ చెప్పి బయటకి వెళ్ళాడు పరమహంస వెళ్తున్న పరమహంస వంక చూసి చిన్నగా నవ్వుకున్నాడు సేర్ తన భార్య మొదటి పుట్టినరోజుకి తన భార్యకి ఏం బహుమతి ఇచ్చాడు తను? గుర్తురాలేదు ఆయనకి అంత గుర్తించుకోదగ్గ రోజుగా జరగలేదు ఆ రోజు. మళ్ళీ బిల్స్‌ని కేష్‌బుక్‌లో వ్రాసేపనిలో మునిగిపోయాడాయన

అయిదునిముషాలలో ఆ చీరని పేక్ చేసి, పాకెట్‌ని పరమహంసకి అందించారు షాపువాళ్లు దాంతో గర్వంగా బయటకి నడిచాడు పరమహంస బయట డిస్‌ప్లేవిండో ముందు నిలబడి చూశాడు ఆ బొమ్మవంక. ఇంకేదో చీర కట్టివుంది ఆ బొమ్మకి చీర పూర్తిగా విప్పేస్తే ఎలా వుంటుందా బొమ్మ నగ్నంగా? తన ఆలోచనకి తనకే నవ్వువచ్చింది పరమహంసకి

దారిలో అరకిలో సోంపట్టి, పూలు, పళ్ళు కొని నడకవేగం పెంచాడు.

ఇంటిసందు మొదట్లోనే కనబడ్డాడు ప్రక్కింటాయన పరమహంస చేతిలో చీరల పాకెట్‌ని చూసి అడిగాడు

"బట్టలు కొన్నట్టున్నారే?"

"అవున నా భార్య పుట్టినరోజు ఎల్లుండి."

గర్వంగా నడిచాడు ఇంటివైపు. గుమ్మంముందు ఆగి తలుపు తట్టాడు చిన్నగా తలుపు తెరుస్తున్న అలికిడి వినబడగానే, చేతులు వెనక్కి దాచేసాడు, పేకెట్ కనబడకుండా

"నీకేం తెచ్చానో చెప్పుకో" అడిగాడు భార్య కనబడగానే

"ఏం తెచ్చారు?"

"అదే చెప్పుకో"

"సోంపట్టి"


"ప్రతీ నెలా తెచ్చేదేగా జీతంరోజు. ఇంకా?"

"మల్లెలు"

"ఇంకా?"

"ముందర లోపలికిరండి"

ఈజీ ఛెయిర్‌లో కూర్చుని, భార్య వంటగదిలోకి వెళ్ళగానే, మల్లెపూల పొట్లం, సోంపట్టి పొట్లం విప్పి టేబిల్




మీద పెట్టాడు చీరపాకెట్ విప్పకుండా ప్రక్కనే పెట్టి, పైన చేతిరుమాల కప్పాడు కనబడకుండా.

"కాఫీకాదు ఇవాళ, పాయసం."

తలెత్తిచూసాడు పాయసం కప్పు అందిస్తున్న భార్యవంక కప్పు అందు కుంటూన్న పరమహంస చేతులు వణి కాయి

"ఎలావుందండి? బావులేదా నాకు? మధ్యాహ్నం కొన్నాను మిమ్మల్ని సర్ ప్రయిజ్ చేద్దామని మా చిన్నాన్న వెళుతూ మొన్న నాకు ఇచ్చిన రెండు వందల సంగతి మీకు చెప్పలేదు అందు కనే వద్దంటున్నా వినకుండా ఇచ్చాడా డబ్బు పుట్టినరోజుకి చీర కొనుక్కో- మని...లాస్ట్ బట్ వన్ ఏన్ట అదృష్టం కదూ?"

బిత్తరపోతూ చూసాడు పరమ హంస— కొద్దిగా బాధ గోచరించింది ఆమెకి భర్త కళ్ళలో

"కౌంటర్‌లోవున్న చీర కొంగిదగ్గిర బాగా చిరిగితే, ఆ బొమ్మకు కట్టిన చీర విప్పించి తీసుకున్నాను ఆ చిరిదినచీర బొమ్మకి కట్టారు"

పరమహంస ఎందుకంతగా కొయ్య బారిపోయాడో అర్థంకాలేదు అతని భార్యకి

ఇప్పుడు ఒంటిమీద తెల్లరంగు చీర బదులు, గులాబిరంగు షిఫాన్‌చీర వుంది పరమహంస భార్య వంటిమీద!!!